# సీఎంవి నీచ రాజకీయాలు!

హైదరాబాద్, న్యూస్‌టుడే: కర్ణాటక ప్రభుత్వం కృష్ణా నదిపై అక్రమంగా నిర్మిస్తున్న 60 వంతెనలు, బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారుతుందని తెదేపా ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటక ప్రాజెక్టులన్నీ పూర్తయితే 100 టీఎంసీల అదనపు నీటిని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిల్వ చేసుకుంటుందని పేర్కొంది. ఒక పక్క తెలంగాణను ఎడారిగా మార్చే పని జరుగుతుంటే... ముఖ్యమంత్రి మాత్రం దాన్ని పట్టించుకోకుండా తెదేపాను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని విమర్శించింది. తెదేపా సీనియర్ నేతలు ఎర్రన్నాయుడు, నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం మాట్లాడారు. భీమా ప్రాజెక్టు కింద 18 బ్యారేజీలు, ఆలమట్టి ప్రాజెక్టు కింద 10 బ్యారేజీలు నిర్మిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనడం లేదన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీతో సహా 11 ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నా... రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందని దుయ్యబట్టారు. వైఎస్ నిర్లక్ష్యం వల్లే మహారాష్ట్ర అక్రమ ప్రాజెక్టులు నిర్మించిందని ధ్వజమెత్తారు.

- తెదేపా నిర్వీర్యంపైనే ఆయన దృష్టి
- తెలంగాణ ఎడారిగా మారుతుంటే పట్టదా?
- మా పార్టీ వారిని కొనేస్తున్నారు
- తెదేపా ధ్వజం

ప్రతిపక్షాలకు పనులు కావన్న పీసీసీ అధ్యక్షుడు డీఎస్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదని, ప్రతిపక్షాలకు పనులు కావనడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని విమర్శించారు. దీనిపై డీఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ దృష్టిలో పనులంటే పైరవీలని అన్నారు.

## ఫిరాయింపులకు శాఖ ఏర్పాటు చేసుకోండి

తెదేపా జడ్పీటీసీలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం సిగ్గుమాలిన చర్య అని ఎర్రన్నాయుడు విమర్శించారు. ఫిరాయింపుల కోసం 'ఆపరేషన్ ఆకర్ష్' అనే పేరు పెట్టి వైఎస్ ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతూ వైఎస్ నీచరాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసుకోవాలని ఎద్దేవా చేశారు. తమ పార్టీ వారిని కొనేసి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న తెదేపా సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి. చిత్రంలో ఎర్రన్నాయుడు